# కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

**సర్కిల్ -18 పరిధిలో 16293 దరఖాస్తులు ● ఆధార్ కార్డుల కోసం జనం పరుగులు**

బంజారాహిల్స్/బేగంపేట్/బన్సీలాల్‌పేట్,డిసెంబర్ 29: జీహెచ్‌ఎంసీ సర్కిల్ -18 పరిధిలో రెండో రోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన 16 కౌంటర్లలో అభయహస్తం పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు.

● తొలిరోజు జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 పరిధిలో అభయహస్తం కోసం 4,730 దరఖాస్తులు రాగా 657 దరఖాస్తులు రేషన్ కార్డులు ఇతర సమస్యలపై వచ్చాయి.

● శుక్రవారం 7008 దరఖాస్తులు అభయ హస్తంలోని పథకాల కోసం వచ్చాయి. మరో 1620 దరఖాస్తులు రేషన్ కార్డులు,ఇతర సమస్యలను తీర్చాలని వచ్చాయి. మొత్తం మీద ఇప్పటివరకు అభయహస్తం కోసం సర్కిల్ పరిధిలో 14015 దరఖాస్తులు వచ్చాయి.

● రేషన్ కార్డులు, ఇతర వినతిపత్రాలు 2277 వచ్చాయని డీఎంసీ ప్రశాంతి తెలిపారు.

● అభయహస్తం పథకాలు పొందడానికి ఆధార్ కార్డు కచ్చితంగా ఉండాలని నిబంధన ఉండడంతో గతంలో ఆధార్ కార్డులో తమ కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు.

● **బేగంపేట్ సర్కిల్ పరిధిలో**..కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ కోసం ఇచ్చిన గ్యారెంటీల అమలు కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ రెండో రోజు కూడా బేగంపేట్ సర్కిల్ పరిధిలో నిర్వహించారు.ఈ కేంద్రాలను బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి సందర్శించారు.


ఫిలింనగర్‌లో ప్రజా పాలన కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన జనం

● ప్రజా పాలన సెంటర్‌లలో ప్రధానంగా గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మీ, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బేగంపేట్, రాంగోపాల్‌పేట్, మోండామార్కెట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు.

**● అర్హులు సద్వినియోగం చేసుకోవాలి**

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని చాచా నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని టీ.పీసీసీ కార్యదర్శి మర్రి ఆదిత్యా రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ విఠల్, నారాయణ, శ్రీనివాస్, డాక్టర్ శివకుమార్‌లాల్, కే హేమలతా, జగదీష్, సురేశ్, రాజేందర్, దశరథ్, మాజీ కార్పొరేటర్ ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


బేగంపేట్ డివిజన్‌లో..


చాచా నెహ్రూనగర్‌లో..


బంజారాహిల్స్‌లోని మీ సేవ కేంద్రం వద్ద

## యువతికి వేధింపులు

బంజారాహిల్స్,డిసెంబర్ 29: పెండ్లికి ముందు యువతితో ఉన్న స్నేహాన్ని అలుసుగా తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10కి చెందిన యువతి(19)కి ఆరు నెలల క్రితం పెళ్లయింది. పెళ్లికి ముందు ఆమెతో సన్నిహితంగా ఉన్న నవీన్ అనే యువకుడు కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నాడు. పెళ్లికి ముందు తనతో దిగిన ఫొటోలను భర్తకు చూపిస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడి వేధింపులు తెలుసుకున్న భర్త యువతిని పుట్టింట్లో వదిలిపెట్టాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన యువతి తనను వేధిస్తున్న నవీన్‌పై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 354(డి) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బీఎండబ్ల్యూ కారు అదుపుతప్పి..

బంజారాహిల్స్,డిసెంబర్ 29: మితిమీరిన వేగంతో వచ్చిన కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాలకు చెందిన బొజ్జ వెంకటనాగసాయి లిఖిత్(20) ఈఎస్‌ఐ మెడికల్ కళాశాలలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్లో ఉంటున్నాడు. స్నేహితులతో కలిసి రాత్రి 11.30 ప్రాంతంలో జూబ్లీహిల్స్‌లో టిఫిన్ చేయడానికి తన బీఎండబ్ల్యూ కారు(ఏపీ 40ఏడీ2226)లో వచ్చి తిరిగి వెళ్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 25లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో వేగంగా వెళ్తున్న బీఎండబ్ల్యూ కారు అదుపుతప్పి జీహెచ్‌ఎంసీకి చెందిన పార్కు ప్రహరీనీ ఢీకొట్టడంతో పాటు పార్కులోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడిపిస్తున్న లిఖిత్‌తో పాటు మరో నలుగురు స్నేహితులకు ముప్పు తప్పింది. ఘటనపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లిఖిత్‌తో పాటు ఇతర యువకులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా మద్యం సేవించలేదని తెలిసింది. ఈ మేరకు నిందితుడిపై ఐపీసీ 336, 184, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

హిమాయత్‌నగర్,డిసెంబర్ 29: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్,వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్ రెడ్డి భవన్‌లో యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే శానిటేషన్, పేషెంట్‌కేర్,సెక్యూరిటీ కార్మికులకు పెంచిన వేతనాలు అమలు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐలు చెల్లించడంతోపాటు పండుగ, జాతీయ,ఆర్జిత సెలవులు అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీబాయి, హసీనాబేగం, ఓమయ్య,దేవానంద్,రేణుక,బాల్‌రాజ్,తులసి,బాలమణి పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత

హిమాయత్‌నగర్,డిసెంబర్ 29: పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా చేయూత నందించాలని ముత్తూట్ ఎం జార్జ్ హయ్యర్ ఎడ్యుకేషన్ జోనల్ మేనేజర్ జితేందర్ కుమార్,హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ కోరారు.ముత్తూట్ గ్రూప్ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసిస్తున్న ఏడు గురు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను శుక్రవారం హిమాయత్ నగర్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ కార్యాలయంలో అందజేశారు.

పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావద్దన్న సంకల్పంతో తమ వంతు ఆర్థిక సహాయం చేస్తున్నామని జితేందర్‌కుమార్ తెలిపారు.ఎంబీబీఎస్ విద్యార్థులకు రెండు లక్షల 40 వేలు ,బీటెక్ విద్యార్థులకు లక్షా 20 వేల చొప్పున అందజేశారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ రీజియన్ మేనేజర్ కె.వి మురళి,సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ గోలిరోజా,సీఎస్‌ఆర్ మేనేజర్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.


హిమాయత్‌నగర్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ కార్యాలయంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న మహాలక్ష్మిగౌడ్

## అప్పు తీర్చలేదని.. బెదిరింపులు

బంజారాహిల్స్, డిసెంబర్ 29: అప్పు తీర్చకపోతే అంతుచూస్తామని, కాళ్లు చేతులు విరిచేస్తామంటూ రోజూ ఫోను చేసి బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7లోని గ్రీన్ వ్యాలీ కాలనీలో నివాసం ఉంటున్న ఆర్.పిళ్లై రైల్వే కాంట్రాక్టర్‌గా పని చేస్తుంటారు. అవసరం నిమిత్తం తనకు రూ.12లక్షలు కావాలని సుకేష్ అనే వ్యక్తిని కోరారు. దాంతో గత ఏడాది అక్టోబర్‌లో పాతబస్తీకి చెందిన సయ్యద్ అబ్దుల్ కావి అనే వ్యక్తి వద్ద నుంచి అప్పుగా ఇప్పించాడు. నాలుగు నెలల్లో రూ.3లక్షలు కలిపి మొత్తం 15లక్షలు ఇస్తానని పిళ్లై చెప్పాడు. నాలుగు నెలల తర్వాత రూ.6.5లక్షలు చెల్లించిన పిళ్లై మిగిలిన మొత్తాన్ని సకాలంలో చెల్లించడంలో విఫలం అయ్యాడు. కొంతగడువు ఇస్తే మిగిలిన మొత్తాన్ని ఇస్తానంటూ సుకేష్‌కు చెప్పాడు. పిళ్లై మాటలు వినకపోగా తీవ్ర పదజాలంతో దూషిస్తున్నారు.ఈ మేరకు బాధితుడు పిళ్లై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులు సుకేష్, సయ్యద్ అబ్దుల్ కావి తదితరులపై ఐపీసీ 506 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్టీసీ బస్సులో గొలుసు చోరీ

బంజారాహిల్స్,డిసెంబర్ 29: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి దృష్టి మరల్చి బంగారు గొలుసు కాజేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..వికారాబాద్‌లోని కార్తికేయనగర్‌కు చెందిన ఎం.రవీందర్ అనే వ్యక్తి ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 28న ఉదయం బేగంపేటలో ఆర్టీసీ బస్సులో రవీందర్ బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లో ఉన్న ప్రైవేటు దవాఖానకు వెళ్తున్నాడు. సాగర్ సొసైటీ సిగ్నల్ వద్దకు రాగానే బస్సు దిగేందుకు ప్రయత్నిస్తున్న రవీందర్‌ను బస్సులో ఉన్న నలుగురు యువకులు గందరగోళానికి గురి చేస్తూ దృష్టి మరల్చారు. వారి నుంచి తప్పించుకుని కిందకు దిగిన రవీందర్ మెడలో ఉండాల్సిన రెండున్నర తులాల బంగారు గొలుసు కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు గురువారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 420, 379 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డ్రగ్స్ విక్రయదారుడు అరెస్ట్

### 20 గ్రాముల ఎండీఎమ్‌ఏ డ్రగ్స్ స్వాధీనం

బంజారాహిల్స్,డిసెంబర్ 29: జూబ్లీహిల్స్‌లోని పబ్స్‌వద్దకు వచ్చే యువతకు డ్రగ్స్‌ను విక్రయించేందుకు బెంగళూరు నుంచి వచ్చిన యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..ఫిలింనగర్ పీఎస్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 78లో ఓ యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పాటు డ్రగ్స్ అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడన్న సమాచారంతో రంగంలోకి దిగిన వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ , ఫిలింనగర్ పోలీసులు అక్కడకు చేరుకుని అతడి బ్యాగును తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్‌లో నిషేధిత ఎండీఎమ్‌ఏ డ్రగ్స్ లభించింది. పట్టుబడిన యువకుడు బెంగళూరులోని నల్లరహళ్లి ప్రాంతానికి చెందిన క్యాబ్‌డ్రైవర్ శివరాంపూర్ బాబు కిరణ్(26)గా గుర్తించారు. బెంగళూరులో ఓ దినా అనే వ్యక్తి వద్ద నుంచి రూ.3వేలకు గ్రాము చొప్పున కొనుగోలు చేశానని, న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా పబ్స్‌వద్దకు వచ్చే వారికి విక్రయించడానికి రైల్లో వచ్చానని అంగీకరించాడు. దీంతో 20 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


